కథానిక

# తొలి చూలు

'శ్రీ పతి'

"ఏమమ్మా...అత్తయ్యా...ఏమంటోంది కోడలు? మరిదిగారు సర్కీటు వెళ్ళారా...ఊళ్ళోనే ఉన్నారా?"

"వాడి కేమే...ఈ కట్టె కదలాడుతూ ఉన్నంతకాలం వాడికి ఇంటిగొడవే పట్టదు. వాడేమో, వాడి ఉద్యోగమేమో! కాస్త ఇంటిసంగతి చెప్పబోయినామన్నా క్షణం ఇంటిపట్టున ఉండడు. ఏం చెప్పినా 'ఆఫీసుజవాను వస్తాడు' అని దులపరించుకుపోతాడు."

"అవునత్తా! మావారూ అంతే. ఏమన్నా అంటే 'నువ్వు పోయి సంపాయించుకురా. నేను ఇంట్లో మహారాజులాగా కూర్చుంటాను. ఆఫీసుకు పోతే ఆగొడవ, ఇంటికి వస్తే ఈ గొడవ! సంపాయించుకువచ్చి పోస్తుంటే సంసారం నడుపుకునే తెలివన్నా లేదు' అని నానాశాపనార్థాలూ పెడతారు"

"ఎంత ఉద్యోగాలు చేస్తేమటుకు-కొంపా గోడూ అక్కర్లేదుటే? సీతమ్మ కొడుకు చూడరాదూ! వాడు తాసిల్దారుట. గడప కదిలివెళ్ళే ఉండేడు. సమస్తం సప్లయి అవుతాయి. జీతంకూడా ఎక్కువేట......"

"ఆ మాట అన్నానసే మొన్న నీకొడుకు తింటూ తింటూ ఉన్న విస్తరి వదిలి, కస్సుమని 'అయితే వాణ్ణే కట్టుకో లేకపోయావ్వు?' అని అడ్డమైన తిట్లూ తిట్టి, రెండురోజులదాకా కొంపచాయలకన్నా రాలేదు. ఉద్యోగం పెద్దదైతే ఎక్కువ జీతం, తక్కువ పనీ ఉంటుందట."

"అవున్లే.మన కేం తెలుసు? పాతకాలంవాళ్ళం. ఇప్పటంటే కొడుకులతోబాటు కోడళ్ళూ ఉద్యోగాలు వెలగబెట్టుకున్నారు. ఆడ ముండలకు ఉద్యోగా లేవిటి అంటే, అటు అవిగా, ఇటు ఈయనా కూడా ధంయిమని లేస్తారు. ఇప్పుడు నీ తోడికోడలు సంగతి చూడరాదూ..."

"ఏమోలే, మన కాలం ఎట్లాగో వెళ్ళిపోతుంది. వాళ్ళకోడలు కాపరానికొచ్చేసరికి కొడుకు ఎక్కడో ఉద్యోగం చేసుకుంటూ ఉంటాడు. వాళ్ళతిప్పలు వాళ్ళు పడతారు. పొద్దెక్కుతోంది. పోతా...ఆఫీసుకు కాస్త ఆలస్యమైతే అన్నంకూడా తినకుండా పోతారు......"

"పోదువుగాన్లే, రా. బిందెడు మంచినీళ్ళు నేనూ తెచ్చుకోవాలిగా! చెరువుకు నేనూ వస్తా. ఎదురుచూస్తున్నారు. అది ఇప్పటికి మొహమన్నా కడుక్కొంది కాదు. కాఫీ ఇప్పటికి నాలుగుసార్లు వెచ్చబెట్టి లేపితే..."

"వొంట్లో ఏమీ కులాసా లేదు కాబోలి. డాక్టరుగారికైనా చూపించకపోయారూ? పిల్ల మరీ పాలిపోతున్నట్టుంది!........."

సుశీలా...ఎట్లా ఉంటోంది? లేచి పెందరాళే కాస్త కాఫీ తాగితే కొంచెం కులాసాగా ఉంటుంది. లే...పాపం అత్తగారు మసిగట్టుకోవడానికి నీకోసమే కనిపెట్టుకుంది."

"నాకేమీ బాగుండటంలేదు అక్కయ్యా. వొళ్ళంతా నొప్పులు. ఏమీ తినా లనిపించదు, తాగా లనిపించదు. నీరసంగా ఉంటుంది. లేచే ఓపికకూడా ఉండేదు. పాపం! అత్తగారు ఇటు నా పనితో, అటు ఇంటిపనితో సతమత మైపోతున్నారు."

"పొట్టప్పుడే ఇటు చెంబు తీసి అటు పెట్టలేనిదానవు. ఇక ఇప్పుడు నువ్వేం చేస్తావు? ఇంతకూ అదృష్టం ఉండొద్దూ...కూర్చోపెట్టి కాచిపోసే కోడలే వస్తే మన సంసారం ఇట్లా ఎందుకుంటుంది?...మా అత్తగారు ఉన్నన్నాళ్ళూ ఎంత చేసినా ఇంకా ఏదో ఉందనే చెప్పేది. అప్పుడింత తినేవాళ్ళం. ఇంత చేసేవాళ్ళం. కాటికి కాళ్ళు చాపుకున్న ముండనైనా నే నే మేడుస్తాను! ఏదో ఆ కాస్తా బయటపడితే అన్నాట్టు వెళ్ళిన వేసుకుపోదామని........"

"అత్తయ్యా, మీరు వెళ్ళండి. నే చూస్తా లెండి. సుశీలా...ఇదిగో పళ్ళపొడి. పాపం! మొహం కడుక్కోవడానికి వేన్నీళ్ళు కూడా పెట్టింది. చూశావా అత్తయ్య అపేక్ష?......"

"అదంతా నామీదనా యేమిటి? ఆ పుట్టుకొచ్చే మనమడి మీదే. పెళ్ళికిముందునుంచే మొదలు పెట్టింది...'చదువుకున్న పిల్లంటు కులా...సరిగ్గా కాపరమైనా చేయలేరు. ఉన్న ఆ కాస్త సామాన్లు అర్చడానికీ, తీర్చడానికీ తీరిపోతుంది. ఈ కాలపు పిల్లలికి కనడమూ చేతకాదు; పెంచడమూ చేతకాదు. అయినా వాళ్ళది ఉద్యోగపు ఫాయా. వాళ్ళతో మనం తూగలేం.'అని కొడుక్కి నూరిపోసింది.

ఇంతలో మా అమ్మ కావాలంది... ఈ సంబంధం అయింది. లేక పోతే నేనూ సుఖంగా ఈ అవస్థ లేకుండా ఉండేదాన్ని......"

"సరే లే...ఆడజన్మ ఎత్తిన తరవాత అనుభవించకే బతకాలి. ఇవాళ ఇక్కడ కాకపోతే రేపు ఇంకోచోట. తప్పే దేమీ లేదు. అయిపోయినదాన్ని గురించి అనుకొని ఏం ప్రయోజనం? కానీ; ఆ కాఫీ కాస్తా చల్లారిపోతుంది..."

"వేడి ఉందిలే......కాస్త ఆ చెంబు ఇలా పెడతావా అక్కయ్యా? ఏదో నువ్వయినా ఉన్నావుగనక ఈవూళ్లో ఉండ గలుగుతున్నా. పలకరిద్దామన్నా ఎవ్వరూ కనపడరు...బావగారు ఊళ్లో ఉన్నారా? రాముడి కేదో సంబంధం వచ్చిందటగా! పిల్ల చదువుకుంటుందేనా?"

"ఏం చదువమ్మా...వాడు చూసుకొని, వాడికి ఇష్టమైతే చేసు కుంటాట్ట. నాలుగు అక్షరంముక్కలు వచ్చేసరికి చిన్నప్పట్నుంచీ పెంచిన అమ్మా, నాన్నా అక్కర లేకపోతుంది...ముందొచ్చిన చెవులకంటే వెనకొచ్చిన కొమ్ములు...!"

"ఏమో రాజ్యం...అయిందా అదిసరేవ? నీకు మరి పొద్దెక్కి పోతోంది. నాకు ఎట్లాగూ ఉండనే ఉంది. నీకూ ఎందు కీ చాకిరి? అదుగో, వాళ్లాయన రానేవస్తున్నాడు. దాని సంగతి వాడు చూసు కోవాల్సిందే. రా, మనం పోదాం. మళ్లీ వాడు అయిందా అయిందా అని అత్తెసరు వేసిన ఘడియనించీ గొంతుమీద కూర్చుంటాడు. ఇంతకీ వాళ్ల నాన్న అదృష్టవంతుడు. నేనే దిరగడై పోయి ఉంటే..."

"ఇప్పుడు అదంతా ఎందుకులే అత్తా! చిలకాగోరింకల్లాగా కొడుకూ, కోడలూ కాపురం చేస్తుంటే చూసే అదృష్టం నీకైనా ఉంది."

* * *

పూర్ణానందం చిన్నప్పట్నుంచీ అతిగారాబంగా పెరిగాడు. వాళ్ల నాన్న అతను ఏది కావాలంటే అదల్లా తెచ్చిపెట్టేవాడు. కొడుకు చాలా తెలివైనవాడనీ, మంచి చురుకైనవాడనీ అందరూ అంటుంటే అతనికి ఎక్కడలేని ఆనందం కలిగేది. ఊళ్ళో పిల్లలంతా పలకలు పట్టుకొని రామయ్యబడికి ప్రొద్దుటినుంచీకూడా నడిచి పోతూ ఉంటే, పూర్ణానందాన్ని మోసుకుపోయేందుకు ఒక పనికత్తెను పెట్టాడు. ఏరోజైనా అది నాగా వేస్తే తనే స్వయంగా బళ్ళోకి ఎత్తుకుపోయి పంతులికి అప్పగించి పెట్టి వస్తూండేవాడు. ఇంత గారా బంగా పెరుగుతున్నా ఆనందం అల్లరిపను లేమీ చేసేవాడు కాడు. కొంచెం మంకుపట్టుమాత్రం పడుతూ ఉండేవాడు. తలుచుకున్న పని కాకపోతే కనపడకుండా ఎక్కడికో వెళ్లిపోయేవాడు. వాళ్ల నాన్న పురవాకిలి, వీధివీధి తిరిగి వెతికి ఇంటికి పట్టుకొచ్చేసరికి. ఇంకా ఎప్పు డన్నా వాళ్లమ్మ శేషమ్మ విసుక్కొని ఒక దెబ్బ వేస్తే వేసిందేమో కాని, సుబ్బారావుమాత్రం కొడుకుని "ఏమిట్రా ఆ పని" అన్నైనా అని ఎరగడు. అందుచేత పూర్ణానందానికి చిన్నప్పట్నుంచీ తన వ్యవహారా లను తన ఇష్టప్రకారం చేసుకుపోయే అలవాటు ఏర్పడింది. ఆఖరుకు సుశీలపెళ్లికూడా అట్లాగే అయింది. ఈ పెళ్లికి సుశీలనాన్న అంత ఇష్టపడలేదు. పూర్ణానందం ఉన్నవాడే అయినా, తీరు అందం గానే ఉన్నా, బాగా చదువుకున్నా, ఎంచేతనో ఆయన తన కూతు రినివ్వడానికి చాలా వస్తాయించాడు. తన కూతురుకూడా చెప్పిన మాట వినే పిల్లగాదు. పెద్దది కాగానే ఏదో పెద్దసంబంధం కుదిర్చి పెండ్లిచేద్దా మనుకున్నాడు. "నాకు పెళ్లివద్దు, గిల్లీ వద్దు. నేను చదువుకుంటా" అని మారాంచేసి బి. ఏ. దాకా చది వింది. పూర్ణానందం కూడా ఇదేరకం. వీళ్లిద్దరికీ కుదరదని వెంకట్రావు అనుమానం; భయంకూడా. అంతా అయి తీరా నాలుగు నెల్లు కాపురంచేసి మొగుడితో దెబ్బలాడి పుట్టింటి కొస్తే నలుగురూ నవ్వి పోతారని, కాస్త చెప్పినమాట వినేవాణ్నిగా చూసి పెళ్లిచేద్దా మనుకున్నాడు. కాని అది కుదిరింది కాదు. కాలేజీలో కుదిరిన స్నేహంతో సుశీల పూర్ణానందాన్నే చేసుకుంటా నంది. వాళ్లమ్మ, అందరి అమ్మల్లాగానే, ఆడపిల్ల పక్షం చేరింది. జిల్లాజడ్జీ చేసి రిటై రైన వెంకట్రావు, పాపం, ఇలాంటి చిక్కు కేసుల్లో ఎన్నింటిలోనో తీర్పు ఇచ్చినా, తల్లీ, పిల్లా ఏకమై వాదించేసరికి 'సరే' అన్నాడు. పదేళ్లయింది పెళ్లి జరిగి. వెంకట్రావు భయపడినట్లు జరక్క పోయినా, మొత్తంమీద సుశీల అంతగా సుఖపడటం లేదు. చదువుకున్న పిల్ల కావాలని చేసుకున్న పూర్ణానందానికి సుశీల ఆశాభంగం కలిగించక పోయినా, తను అనుకున్నట్లు కాపురం సాగటంలేదు. పూర్ణానందం చిన్నప్పట్నుంచీ ఒంటరిగా పెరిగాడేమో, పిల్లలంటే అమిత అపేక్ష. తనకు తమ్ముళ్లుగాని, చెల్లెళ్లుగాని లేరని, వాళ్ల అమ్మా నాన్నా కంటెకూడా ఎక్కువగా విచారించేవాడు. అసలు సుశీలను పూర్ణానందానికివ్వడానికి కూడా ఇదే కారణం. ఆడబిడ్డల ఆరళ్లు గానీ, తోడికోడళ్ల దెప్పుళ్లుగానీ ఉండవని సుశీలతల్లి ఆశపడి ఈ సంబంధానికి ఒప్పుకుంది.

సుశీలకు పిల్లలంటే తేళ్ళూ, జెర్రులూ పాకినట్లుంటుంది. ఎవరి పిల్లలైనా అయితే కాసేపు సరదాగా ఆడించి, ఎత్తుకొని, ముద్దులాడి అదీ ఇదీ కొనిపెట్టి ఆనందిస్తుంది. కాని తనే పిల్లల్ని కని పెంచి, పోషించాలంటే భయం. అందుచేతనే పూర్ణానందం, వాళ్లమ్మ ఏకమై తన నిలా నానాబాధలూ పెడుతున్నారని సుశీల కోపం. అంతకు మించి పూర్ణానందంమీదగాని, అత్తగారిమీదగాని ఏమీ లేదు. వాళ్లమ్మకి తొమ్మిది కాన్పులు. కాన్పుకాన్పుకీ ఎంతో అవస్థ పడుతూ ఉండేది. తన తరువాత పుట్టిన నలుగురుపిల్లల సంగతి బాగా చూసిందేమో పాపం, సుశీలకు ఆ 'ప్రసవపర్వం' అంటే అమిత భయం ఏర్పడింది. పుట్టబోయేవాళ్ల సంగతి ఎట్లా ఉన్నా ముందు తనకే ప్రమాదం వస్తుందో అని భయం. ఎంత జాగ్రత్తపడినా తప్పింది కాదని చాలా బాధపడుతూ ఉండేది. "సగం దాని దిగులే దాని రోగానికి కారణం. డాక్టర్లేం చేస్తారు, మంత్రసాన్లేం చేస్తారు?" అని శేషమ్మగారు రోజూ అంటూనే ఉండేది.

పదో నెలకూడా వచ్చింది. నొప్పులు ఎక్కువైనయ్యో గాని, అసలవి ప్రసవ వేదనలాగా ఎవరికీ అనిపించలేదు. శేషమ్మగారు మాత్రం తొలిచూలు అట్లాగే ఉంటుందనీ, తనకి మనవరాలే పుట్టు కొస్తుందనీ పదో నెల నగబడినప్పట్నుంచీ అంటూ ఉంది.

పూర్ణానందం సెలవు పెట్టక తప్పిందికాదు. ఊళ్లో ఉన్న వైద్యుల కేమీ అంతుపట్టలేదు. పెద్దఆస్పత్రినుంచి ఆడడాక్టర్ను తెచ్చి చూపించమని అందరూ అన్నారు. "అక్కర్లేదురా. నిన్ను కడుపులో ఉన్నప్పుడు నాకూ ఇట్లాగే ఉండేది" అని వాళ్లమ్మ వారించింది. సుశీల చిక్కి మొగం వేసుకొని, ఆఖరుగడియలు వచ్చినట్లు, అవసానకాలం సమీపించినట్లు పూర్ణానందంకేసి జాలిగా చూచి కళ్లనీళ్లు పెట్టుకుంది. పూర్ణానందానికి ప్రపంచం ఒక్కసారి గిర్రున తిరిగినట్లయింది. సుశీల అంటే అతనికి పంచప్రాణాలూ. చెప్పిన మాట వినకుండా, ఇలా చేశామే అనే పశ్చాత్తాపంతో సుశీలను ఓదార్చి ఆడడాక్టరును తీసుకురావడానికి స్నేహితుడి కారు తీసుకుని వెళ్లాడు.

శేషమ్మగారు మాత్రం చేరిన అమ్మలక్కల్తో "ఏముందే... వాడు పిచ్చివెధవ! అని వాణ్ని దానిష్టంవచ్చినట్లు ఆడిస్తోంది. ఏమంత వచ్చిందని కంగో ఎంతో పోసి దాన్ని తీసుకురావడానికి? ఈ వూళ్లో సుబ్బి ఎన్ని పురుళ్లు పోసింది! అయినా ప్రపంచంలో ఇంకెవ్వరూ పిల్లల్ని కనటం లేదా ఏమిటి? ఏదో రాకరాక వచ్చింది. అందులోనూ అది కొత్త అర్భకురాలాయెను. చదువు చదువని వొంట్లో ఉన్న జవసత్వాలను చంపుకుంటే మరి ఇట్లాంటివి వచ్చినప్పుడు కష్టమే. కాకపోయినా ఈకాలం ఏదొచ్చినా ఇంతే. కనలేనని పిల్లలు వద్దనుకుంటారుటమ్మా! ఎక్కడన్నా? ఇంట్లో నలుగురు పిల్లలుంటేనే కొత్త కళకళలాడుతూ ఉంటుంది"

"నిజమే నవ్వా. పిల్లలు పుట్టలేదని చెట్లకూ పుట్లకూ, దేవుళ్లకూ దేవతలకూ ప్రాణాచారం పడేవాళ్లు కొందరూ. పిల్లలు పుడుతుంటే అక్కర్లేదని కడుపుతీసుకునేవాళ్లు కొందరూ" అని రాజ్యమ్మ పెద్దకూతు రనేసరికి "ఎవరే అదీ?...పిట్ట కొంచెం, కూత ఘనంఅల్లే ఉంది......నాకు చూపుకూడా పోతోంది." అని శేషమ్మగారు పరామర్శిస్తుండేసరికి వాకిట్లో కారు హఠాత్తుగా ఆగిన చప్పుడల్లే వినిపించింది.

"అమ్మా! ఎట్లా ఉందే సుశీల...? తీసుకువచ్చా డాక్టర్ని. ఆస్పత్రిమంత్రసానికూడా వచ్చింది. ఇంక ఫరవాలేదులే..." అంటూ పూర్ణానందం హడావిడిగా ఇంట్లోకి పోయి ఒక కుర్చీ ఎత్తుకొని సుశీలగదిలోకి వెళ్లాడు. డాక్టరు ముందు వెళ్లింది. మంత్రసాని సరంజామా అంతా తీసుకొని అక్కడ చేరినవాళ్లతో తన కాన్పుల అనుభవాలు చెప్పుకుంటూ పోయింది. "కొండ తవ్వి ఎలుకని పట్టిన కేసులు ఎన్నో ఉన్నాయి" అని మంత్రసాని అనేసరికి, మంగలిసుబ్బి "అట్లాంటివి నే పుట్టి బుద్ధెరిగినతరువాత ఈవూళ్లో ఇంకవరకూ ఒక్కటే లే"దన్నది.

అందరికీ ఆందోళన ఎక్కువైంది. డాక్టరు ఏమంటుందో అని అందరూ ఆటుకేసే చూస్తున్నారు. ఇదంతా చూసేసరికి అంతటి శేషమ్మగారికీ దడ పుట్టుకువచ్చింది. ఏదో పుట్టిమునిగిందని కంగారు పడింది. దీనికితోడు వచ్చిన డాక్టరు ఊళ్లో ఉన్న డాక్టరుకు కబురు పెట్టింది. ఇద్దరూ గదిలోనుంచి బయటికి వచ్చి అంతా అనుమానంగా ఉన్నట్లు మొహాలు పెట్టి "ఏంచేద్దాం" అని వేలకేసి చూస్తున్నారు. "ఏమైనా ఆపరేషన్ చేయాల్సిందే" అని ఆఖరికి ఆడడాక్టరు అనేసరికి "నిండుచూలాలి కడుపు కోయడం ఏమిట్రా" అంటూ శేషమ్మగారు స్పృహతప్పి పడిపోయింది. ఆ మాటే ఆమెకు ఏదో అవాచ్యంగా తోచింది.

వైద్యు లిద్దరూ సంప్రతించుకొని అక్కడే ఆపరేషనుకు అన్ని ఏర్పాట్లూ చేశారు. పూర్ణానందంకూడా ఏమనడంలేదన్నమాటే గాని, పాపం నీరైపోయి గది ఇవతల గోడకు ఆనుకొని ఎదురుగా ఉన్న గోడకు తగిలించిన సుశీలపెళ్లి ఫోటోకేసి రెప్పవాల్చకుండా చూస్తున్నాడు.

"అంతా అయింది. కొంచెం హార్లిక్స్ పెట్టి ఇవ్వండి. చాలా బలహీనంగా ఉంది. పాపం, వొంట్లో రక్తంకూడా లేదు" అన్నాడు వూరి వైద్యుడు మెల్లిగా బయటికి వచ్చి. అసలు సంగతి చెప్పడేమని అందరూ కోపంగా చూస్తున్నారు. మూలపడి మూలుగుతూఉన్న శేషమ్మగారు "మనమడా, మనమరాలా?" అని అంటూ లేవబోయింది. పూర్ణానందం పోయి స్టవ్వు ముట్టించి ఇంత హార్లిక్స్ కాచి ముందు తల్లి కిచ్చి, తరువాత గదిలోకి తీసుకుపోయాడు. డాక్టరు సుశీల తలవైపు కూర్చుని ధైర్యం చెబుతూ ఉంది. పూర్ణానందం భయపడుతూ, గాంతితో ఏమైనా పడిందేమో, నూనెలోగాని ముఖం చూపరాదేమో అనే సంకోచంతో వాకిలిదగ్గరగా ఉన్న బల్లమీద కప్పు పెట్టి బయటికి పోతుంటే "ఫరవాలేదు, రండి" అని డాక్టరు పిలిచింది.

సుశీల పక్కమీద ఒంటరిగానే పడుకొనిఉంది. నాల్గువైపులా చూచాడు. ఏమీ కన్పించలేదు. అసలు కెవ్వుమనే కేకైనా వినిపించింది కాదు. అతనికి దడుసు పుట్టుకువచ్చింది. "భయపడకండి. మీ రనుకున్న దేమీ కాదు" అని సుశీల ఆ నీరసస్వరంలో కూడా తనే గెల్చా ననే ధీమా వెళ్లబోస్తూ అన్నది.

పూర్ణానందానికి అర్థమైంది. ఇంత బాధ పడిసా ఇలా అయిందా అని కొంచెం విచారించి తల్లిదగ్గరకు వెళ్లాడు. "అమ్మా, ఏం ఫరవాలేదు లే. సుశీల బాగానే ఉంది. దాని కేం భయం లేదని డాక్టరు చెప్పింది" అన్నాడు. "పిల్లకి బొడ్డుకోశారా, లేదా?" అంటూ లేవబోతూఉండగా మంత్రసాని దోసిట్లో గుడ్డ కప్పి ఏదో తీసుకురావడం చూసింది. ఒక్కసారి ఆవురుమన్నది....పూర్ణానందం గ్రహించి "అహ అది మనం అనుకున్నది కాదులే. ఏదో బల్ల పుట్టుకువచ్చిందట. ఇంకా కొన్నాళ్లుంటే మరీప్రమాదం అని డాక్టరు అంది" అని తలకాయ వంచుకొని వాళ్లమ్మచెయ్యి పట్టుకొని ఏదో చెప్తున్నాడు.

ఆలా అంటుండగానే కాళ్లూ, చేతులూ చల్లబడినట్లయింది. డాక్టరును పిలిచాడు. డాక్టరు వచ్చి, నాడి చూసింది. గుండె పరీక్ష చేసింది. మూసిన కళ్లు అడుగు రెప్ప కిందికి లాగి చూసింది. వెంట వెంటనే నాలుగు ఇంజక్షన్లు ఇచ్చింది...మళ్లీ నాడి చూచి..."షాక్ ...సెరిబ్రల్ హెమరేజ్...పాపం"